## ఎక్సైజ్ కమిషనర్ అవినీతి చేష్టలతో ప్రభుత్వం అప్రతిష్ట పాలు





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


## ప్రొఫెసర్ జి. పోచయ్య తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో చేరిక..





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 269 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 23 సెప్టెంబర్ 2026


## అట్టడుగు వర్గాల అభివృద్ధే

# ప్రభుత్వ లక్ష్యం

- దళితులు, ఆదివాసీలు, గిరిజనులను దృష్టిలో ఉంచుకునే సంక్షేమ పథకాలు
- పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలి: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** దళితులు, ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై నిర్వహించిన కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. సొంత తల్లిలా ప్రేమ చూపించిన ఇందిరాగాంధీని దళితులు, ఆదివాసీలు, గిరిజనులు ఇప్పటికీ మరిచిపోలేదని పేర్కొన్నారు. 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీదేనని కొనియాడారు. ఆమె స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 31 శాతం మంది లబ్ధిదారులు దళితులేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎస్టీలకు 17 శాతం ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. మిగతా2లో...

## రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం: కేటీఆర్

- ముగ్గురు చిన్నారుల మృతి తీవ్ర విషాదం.. మరో 23 మందికి గాయాలు
- ప్రతి బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: కేటీఆర్



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. మరో 23 మంది చిన్నారులు గాయపడిన నేపథ్యంలో వారికి మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం మిగతా2లో...



## ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం

- ఏసీ పేలి ముగ్గురు నవజాత శిశువులు మృతి
- 24 మందికి అస్వస్థత ..ప్రయివేటు ఆస్పత్రులకు తరలింపు
- విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఆస్పత్రిని సందర్శించినవైద్యారోగ్య శాఖ మంత్రి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తల్లి గర్భం నుంచి బయటకు వచ్చి కండ్లు కూడా సరిగా తెరవని నవజాత శిశువులు చికిత్స పొందుతున్న ప్రత్యేక నవజాత శిశుసంరక్షణ కేంద్రంలో ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా మిగతా2లో...

## వందే మాతరం పాడకుంటే జైలు శిక్ష కరెక్ట్ కాదు: సుప్రీంకోర్టు

**హైదరాబాద్ సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ గీతం 'వందేమాతరం'ను పూర్తిగా పాడేందుకు అభ్యంతరం వ్యక్తం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వానికి జాతీయ గీతం నిడివి, పరిధిని పెంచేందుకు అధికారం ఉందని, ఇది వ్యక్తిగత, సామూహిక మతస్వేచ్ఛను మిగతా2లో...



## ఒప్పందాన్ని తిరస్కరిస్తే .. ఇరాన్‌ను నాశనం చేస్తాం

- ఐరాస జనరల్ అసెంబ్లీలో ట్రంప్ బెదిరింపు



**న్యూయార్క్ సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడులను పునఃప్రారంభించాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. నవంబర్ 3న జరిగే మధ్యంతర ఎన్నికల మిగతా2లో...

## అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్

**హైదరాబాద్ సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ ఎన్. లక్ష్మీభాస్కర్‌ను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. కాసేపట్లో ఆయనను కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ రోజు ఉదయం నుంచి హైదరాబాద్ ఎర్రగడ్డలోని లక్ష్మీభాస్కర్ నివాసంతో పాటు మరో 7 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి, మణికొండ, మిగతా2లో...



## అంగరంగ వైభవంగా జాతీయ అవార్డుల

# ప్రదానోత్సవం

- దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న అనంత్ నాగ్
- ఉత్తమ నటుడి అవార్డును అందుకున్న మమ్ముట్టి, కార్తిక్ ఆర్యన్
- 'కల్కి 2898 ఏడీ'కి రెండు జాతీయ అవార్డులు
- తెలుగు సినిమాలు 'పుష్ప 2', 'కమిటీ కుర్రోళ్లు', '35.. చిన్న కథ కాదు', 'లక్కీ భాస్కర్'కు అవార్డులు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో తారల తళుకుబెళుకుల మధ్య అంగ రంగ వైభవంగా జరిగింది. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వేదికగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పలువురు ప్రముఖ సినీ నటులు, సాంకేతిక నిపుణులు పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు. మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, బాలీవుడు నటుడు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. భ్రమయుగం చిత్రానికి మమ్ముట్టిని, చందూ ఛాపియన్ చిత్రానికి కార్తిక్ ఆర్యన్‌ను ఈ అవార్డు వరించింది. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370 నిలిచింది. ఈ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. అమరన్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి అవార్డును అందుకున్నారు. సత్తా చాటిన తెలుగు సినిమాలు... జాతీయ అవార్డుల్లో మిగతా2లో...

## మూడు రాష్ట్రాల్లో 12 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 12 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. వీటిలో యూపీలో 10, ఉత్తరాఖండ్‌లో ఒక స్థానానికి ద్వైవార్షిక ఎన్నికలు, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. ఎన్నికల నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 వరకు గడువు విధించారు. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన, 9న ఉపసంహరణకు గడువు ముగుస్తుంది. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు మిగతా2లో...

## భారీ వర్షాలు.. అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు




## దసరాకు కొత్త పింఛన్లు

- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



# విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**● యాదాద్రి ప్లాంట్‌లో 4,000 మెగావాట్లకు కేవలం 400 మెగావాట్ల ఉత్పత్తి ● రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం: హరీశ్‌రావు**

**హైదరాబాద్ సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ముఖ్యనేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించామని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు 7 గంటలకు మించి విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆయన విమర్శించారు. 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో



ప్రస్తుతం కేవలం 400 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సామర్థ్యం లేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్టీపీసీ 800 మెగావాట్ల ప్లాంట్‌ను అందిస్తామని ప్రతిపాదించినప్పటికీ ప్రభుత్వం నిరాకరించిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న తక్కువ వోల్టేజీ విద్యుత్ కారణంగా రైతుల వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు నిరంతరాయం గా, నాణ్యమైన విద్యుత్ అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

# అంగరంగ వైభవంగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు సినిమాలు సత్తా చాటాయి. 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు లభించాయి. 'కల్కి 2898 ఏడీ' ప్రజాదరణ పొందిన ఉత్తమ చిత్రంగా నిలిచింది. అలాగే సినిమాకు అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషించిన ప్రొడక్షన్ డిజైనర్ నితిన్ జిహానికి బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ అవార్డు లభించింది. 'కల్కి 2898 ఏడీ' చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాతలు అశ్వినీదత్, స్వప్నదత్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొని అవార్డులు అందుకున్నారు.

'పుష్ప 2' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే రైటర్‌గా సుకుమార్ జాతీయ అవార్డును అందుకున్నారు.

ఇక కమిటీ కుర్రోళ్లు, 35.. చిన్న కథ కాదు, లక్కీ భాస్కర్ సహా పలు చిత్రాలు వివిధ విభాగాల్లో మొత్తం 9 అవార్డులను సొంతం చేసుకోవడం విశేషం.

'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి రెండు కేటగిరీల్లో వచ్చిన అవార్డులను మేకర్స్ అందుకున్నారు.

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి, శ్రీ రాధా దామోదర స్టూడియోస్ తరపున నిహారిక కొణిదెల 'ఉత్తమ తెలుగు చిత్రం' విభాగంలో 'రజత కమలం' అవార్డును స్వీకరించగా, దర్శకుడు యదు వంశీ కూడా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుని అందుకున్నారు.

ఈ చిత్రానికి పి. రవి కుమార్ 'ఉత్తమ మేకప్' అవార్డును అందుకున్నారు.

ఈ వేడుకకు నాగబాబు, పద్మజ కొణిదెల, ఫణి అడపాక తదితరులు హాజరయ్యారు.

# మూడు రాష్ట్రాల్లో 12 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్టు ఈసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. యూపీలో నవంబర్ 25తో ముగియనున్న 10 మంది రాజ్యసభ సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీరిలో బిజెపికి చెందిన అరుణ్‌సింగ్, గీతా శాక్య, నీరజ్ శేఖర్, బృజ్‌లాల్, బీఎల్ వర్మ, సీమా ద్వివేది, హర్దీప్‌సింగ్ పురి ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్‌గోపాల్ యాదవ్, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన రామ్‌జీ గౌతమ్ పదవీకాలం కూడా ముగియనుంది. మాజీ ఉపముఖ్యమంత్రి దినేశ్ శర్మ రాజీనామాతో మరో రాజ్యసభ స్థానం సెప్టెంబర్ 11 నుంచి ఖాళీగా ఉంది. అండమాన్-నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆయన రాజీనామా అమల్లోకి వచ్చింది. ప్రస్తుత అసెంబ్లీ బలాబలాల ప్రకారం యూపీలో బిజెపి నేతృత్వంలోని కూటమి 8 స్థానాలు, సమాజ్‌వాదీ పార్టీ 2 స్థానాలు గెలుచుకునే అవకాశముందని రాజకీయ లెక్కలు సూచిస్తున్నాయి. దీంతో బీఎస్పీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చు. ఇక ఉత్తరాఖండ్‌లో బిజెపి సభ్యుడు నరేశ్ బన్సాల్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఆ ఒక్క స్థానానికి ఎన్నిక జరగనుంది. మరోవైపు పశ్చిమ బెంగాల్‌లో నటులు కోయెల్ మల్లిక్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి మల్లిక్ జూలై 16న రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికైన సభ్యులు 2032 ఏప్రిల్ 2 వరకు మిగిలిన పదవీకాలాన్ని కొనసాగిస్తారు.

# ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. వైద్య సిబ్బంది కేకలు వేస్తూ బయటకి వచ్చి ఎస్ఎన్‌సీయూ వార్డులో మంటలు వస్తున్నాయని తెలపడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ విభాగానికి చేరుకుని 27 మంది నవజాత శిశువులను కాపాడారు. అందులో ఒకరు అప్పటికే మృతి చెందారు. ఇద్దరు చిన్నారులు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణం కోల్పోయారు. **అర్ధరాత్రి ఉరుకులు పరుగులు** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)లోని ప్రత్యేక నవజాత శిశుసంరక్షణ కేంద్రంలో సోమవారం 11.45 గంటల సమయంలో కు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ విభాగంలోని రిసెప్షన్ వద్ద ఉన్న ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో పేలుడు సంభవించింది. అందులోని గ్యాస్ లీకై దట్టమైన పొగ అలుముకుంది. అక్కడున్న వైద్యులు, సిబ్బంది భయంతో పరుగులు తీశారు. దీంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని అయోమయం నెలకొంది. తల్లిదండ్రులు, కుటుంబీకులు కొంత మంది సిబ్బంది లోపలకు వెళ్లి చిన్నారులను ఒక్కొక్కరినీ బయటకు తీసుకొచ్చారు. అప్పటికే చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రుల రోదనలు, చిన్నారుల ఏడుపులతో ఆ వార్డు దద్దరిల్లింది. మిగతా వార్డుల్ల చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు, వైద్య సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కొంతమంది సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి నవజాత శిశువులను కాపాడారు. అయినప్పటికీ ఓ శిశువు పొగతో ఊపిరాడక ప్రాణం కోల్పోయింది. ప్రమాద తీవ్రత పెరగకుండా ఆ వార్డులో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఇంక్యుబేటర్లు పనిచేయడం ఆగిపోయాయి. వెంటిలేటర్లపై ఉన్న నలుగురు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే అర్ధరాత్రి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ రిమ్స్‌కు చేరుకుని సంఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులను జిల్లా కేంద్రంలోని ప్రయివేటు చిల్డ్రన్ ఆస్పత్రులకు తరలించారు. **కండ్లు తెరవక ముందే ఆగిన ఊపిరి** ఇచ్చోడ మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సలీంఖాన్(ఫీర్‌ఖాన్)–సబానాఖాన్‌కు శుక్రవారం పాప జన్మించింది. ఏడు నెలలకే పాప జన్మించడంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. షార్ట్ సర్క్యూట్‌తో మంట లు వ్యాపించడంతో ఊపిరాడక చిన్నారి మృతి చెందింది. ఇంద్రవెల్లి మండలంలోని గిన్నెరకు చెందిన షేకుబాయి–కుమ్ర దినేష్ దంపతులకు రెండో సంతానంగా ఆడబిడ్డ జన్మించింది. ఎనిమిది నెలలకే బిడ్డ పుట్టడంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. పొగ వల్ల అస్వస్థతకు గురైన చిన్నారిని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన సబా సమ్రిన్–తౌఫిక్ దంపతులకు రెండో సంతానంగా ఆడబిడ్డ జన్మించింది. బరువు 1100 గ్రాములే ఉండటంతో ఎస్ఎన్‌సీ యూలో ఉంచారు. పొగతో ఊపిరాడక చిన్నారి అస్వస్థతకు గురైంది. మొదట జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం నిర్మల్, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. అక్కడికి చేరుకునే సమయంలోనే చిన్నారి మృతిచెందింది. **సమగ్ర విచారణ చేపడతాం : మంత్రి దామోదర రాజనర్సింహ** వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో మంగళవారం రిమ్స్‌కు చేరుకున్నారు. ఎస్ఎన్‌సీయూతో పాటు పలు వార్డులను పరిశీలించారు. రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని తెలిపారు. దాదాపు గంటకుపైగా పలువురు రోగులతో మాట్లాడి సంఘటన తీరు అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ ఆడిట్‌లను నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లో అందే నివేదిక ఆధా రంగా తగు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా 150 పడకలతో కూడిన మాతా శిశుసంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేప డతామన్నారు. వంద రోజుల్లో రిమ్స్ ప్రక్షాళన చేపట్టి రూపురేఖలు మార్చుతామన్నారు. ఇలాంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని చెప్పారు.

# అట్టడుగు వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని వివరించారు. తెలంగాణలో 3 కోట్ల 48 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని సీఎం తెలిపారు. సన్నబియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మెరుగైన భోజనం అందించగలుగుతున్నామని చెప్పారు. ఈ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. బాధితులకు అందించాల్సిన నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానల్ ద్వారా వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. "చదువొక్కటే జీవితాలను మారుస్తుంది. అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్య పరిష్కారం కాదు. పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించండి. రాజకీయాలకు అతీతంగా ఈ వర్గాల అభివృద్ధికి కృషి చేద్దాం. ఈ ప్రభుత్వం మీది.. మీ కోసం పనిచేస్తుంది" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు

# రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కారణంగానే ఇంతటి దుర్ఘటన చోటుచేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. అభంశుభం తెలియని చిన్నారులు అన్యాయంగా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ వైద్య రంగం నిర్లక్ష్యానికి గురైందని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలోని పరిస్థితులపై జిల్లా స్థాయి బీఆర్ఎస్ నాయకులు పలుమార్లు ప్రభుత్వాన్ని హెచ్చరించినప్పటికీ చర్యలు తీసుకోలేదని కేటీఆర్ పేర్కొన్నారు. పిల్లల వార్డులో అత్యంత పకడ్బందీగా భద్రతా చర్యలు ఉండాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ పర్యవేక్షణ లోపించిందని ఆరోపించారు. కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర ఘటన చోటుచేసుకుందని విమర్శించారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తక్షణమే తనిఖీ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విద్యుత్, అగ్నిమాపక, భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారులను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కేటీఆర్ కోరారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

# వందే మాతరం పాడకుంటే జైలు శిక్ష కరెక్ట్ కాదు: సుప్రీంకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘించదని తెలిపింది. వందేమాతరంలోని ఒకటి లేదా అన్ని చరణాలను పాడటానికి అభ్యంతరం తెలిపేవారిని శిక్ష?ర్హమైన పరిణామాలకు గురిచేయకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. ఇక్కడ జాతీయ గీతం ఏమిటనేది వివాదాస్పదం కాదని, జాతీయ గీతం ఎలా ఉండాలి, అది రెండు చరణాలా లేదా నాలుగు చరణాలా అనే అంశంపై ప్రభుత్వం నిర్ణయిస్తుందని ధర్మాసనం పేర్కొంది. అయితే ఆర్టికల్ 25, 26 (మత స్వేచ్ఛ)ను ఉల్లంఘించలేరు లేదా మనస్సాక్ష?కి విరుద్ధంగా వ్యవహరించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేరని స్పష్టం చేసింది. జాతీయ గీతంలోని ఒకటి లేదా అన్ని చరణాలను ఆలపించాలా వద్దా అనేది వ్యక్తి తన మనస్సాక్షి ప్రకారం నిర్ణయించుకోవచ్చని, అందుకు నిరాకరించినందుకు అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోరాదని ధర్మాసనం తెలిపింది. మత స్వేచ్ఛ, రాజ్యాంగబద్ధమైన సహనం, మౌనంగా అభ్యంతరం తెలిపే హక్కును సమర్థిస్తూ 1986లో 'బిజోయ్ ఇమ్మాన్యుయేల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇప్పటికీ వర్తిస్తుందని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. చరిత్రను శ్రద్ధగా చదివిన ఎవరికైనా జాతీయ గీతం గురించి తెలిసి ఉంటుందని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుండే 'వందేమాతరం' జాతీయ గీతంగా ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదే నిర్ధారణకు రావడానికి ఆచార వ్యవహారాలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని జస్టిస్ బాగ్చీ పేర్కొన్నారు. జనవరిలో హోంశాఖ జారీ చేసిన పరిపాలనా ఆదేశాలు, జూలైలో తదుపరి సర్క్యులర్‌తో కలిపి, జాతీయ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) చట్టం, 2026ను సవాలు చేస్తూ ప్రముఖ కర్ణాటక గాయకుడు, రచయిత టి.ఎం. కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం నుండి కోర్టు స్పందన కోరింది.

# ఒప్పందాన్ని తిరస్కరిస్తే .. ఇరాన్‌ను నాశనం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఇరాన్‌తో ఒప్పందం కుదురుతుందని అంచనా వేస్తూనే, ఒకవేళ ఒప్పందాన్ని తిరస్కరిస్తే ఇరాన్‌ను నాశనం చేస్తామని బెదిరించారు. మంగళవారం ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో ట్రంప్ ప్రసంగిస్తూ ఇరాన్‌కు రెండు ప్రత్యామ్నాయాలను సూచించారు. ఒకటి.. దేశాన్ని పునర్నిర్మించుకోవడానికి వీలు కల్పించే ఒప్పందం చేసుకోవడమా లేక అమెరికా సైనిక చర్యను కొనసాగించడమా తేల్చుకోవాలని హెచ్చరించారు. "నేను ఇస్లామిక్ రిపబ్లిక్‌ను త్వరగా నాశనం చేయాలా? లేక వారి మనుగడకు అవకాశం లేకుండా భవిష్యత్తు వైభవం లేదా తరాలపై ఆశ లేకుండా నరకానికి పంపాలా?" అని ట్రంప్ అన్నారు. అమెరికా సైనిక చర్యను ట్రంప్ సమర్థించడంతో ఇరాన్ ప్రతినిధులు వాకౌట్ చేశారు. దీంతో హాలులో కేవలం ఒక ప్రతినిధి మాత్రమే మిగిలినట్టు సమాచారం. అదే విధంగా "వారు ఒకప్పుడు మధ్యప్రాచ్యంలో పెత్తనం చెలాయించేవారు, కానీ ఇప్పుడు అలా లేరు" అని ఇరాన్‌ను ప్రపంచంలోనే ఉగ్రవాదా నికి ప్రధాన స్పాన్సర్‌గా ట్రంప్ అభివర్ణించారు. టెహ్రాన్‌తో ఒప్పందం కోసం వాషింగ్టన్ పదేపదే ప్రయత్నించిందని, కానీ ఇరాన్ ఆ ప్రయత్నాలను తిరస్కరించిందని చెప్పారు. టెహ్రాన్ తన క్షిపణి , డ్రోన్ సామర్థ్యాలను విస్తరిస్తోందని, అవి ఐరో పాకు ముప్పు కలిగించగలవని కూడా ట్రంప్ ఆరోపించారు. **ఒత్తిడిని కొనసాగించాలని ట్రంప్ పిలుపు** టెహ్రాన్‌పై ఒత్తిడిని కొనసాగించాలని ట్రంప్ ఆయా దేశాలను కోరారు . వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులను ఖండించినందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి ధన్యవాదాలు తెలిపారు. "ఇప్పుడు మనం ఒత్తిడిని కొనసాగించడంలో అంతే ఐక్యంగా ఉండాలి" అని ఆయన అన్నారు. హార్ముజ్ జలసంధి గుండా యూఎస్ నౌకాదళం 1 బిలియన్ బ్యారెల్లకు పైగా చమురును రవాణా చేసిందని అన్నారు.

# అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో ఆయనకు ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే యాదాద్రి, నందిగామ, శామీర్‌పేట్‌లో నాలుగు ఓపెన్ ప్లాట్లతో పాటు విశాఖపట్నంలో 800 చదరపు గజాల ఓపెన్ ప్లాట్ గుర్తించామని చెప్పారు. అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ.41లక్షలు, పోస్టాఫీసులో రూ.12 లక్షలు డిపాజిట్ల రూపంలో ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇక ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో రూ.35 లక్షలు, మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.29.55 లక్షలు పెట్టుబడులు పెట్టినట్లు కనుగొన్నామని ఏసీబీ అధికారులు వివరించారు. దీంతో పాటు 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారమని ఏసీబీ అధికారులు తెలిపారు. జాగ్వార్, ఆడీ, టాటా నెక్సాన్ సహా 3 కార్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్, వెస్పా, యాక్టివా, యమహా వంటి నాలుగు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు గుర్తించారమని అన్నారు. సుమారు రూ.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు ఉన్నాయని కూడా చెప్పారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ప్రకారం లక్ష్మీభాస్కర్ మొత్తం ఆస్తుల విలువ రూ.6.13 కోట్లు ఉంటుందని లెక్కించామని పేర్కొన్నారు. వివాదంలో ఉన్న ఓ ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తమ సోదాల్లో గుర్తించామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. అలాగే తన సన్నిహితులకు రూ.1.33 కోట్లు అప్పుగా లక్ష్మీభాస్కర్ ఇచ్చినట్లు గుర్తించామన్నారు. ఆయన అదనపు ఆస్తులపై వెరిఫికేషన్ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వివరించారు.

# దసరాకు కొత్త పింఛన్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** చేయూత పథకం కింద కొత్త పింఛన్లను దసరాలోపు లబ్ధిదారులకు అందజేసేందుకు సర్కార్ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్‌ను ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి దసరాలోపు క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా చేయూత పథకంలోని అన్ని కేటగిరీలకు కాకుండా ఈ సారీ వితంతు, వికలాంగులు, గీత, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, డయాలసిస్, ఫైలేరియా బాధితులు అనే ఏడు రకాల వారికి మాత్రమే పింఛన్లను అందించనున్నారు.

# భారీ వర్షాలు.. అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హైడ్రా, పోలీస్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్లు, ప్రధాన జంక్షన్లలో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

# ఎక్సైజ్ కమిషనర్ అవినీతి చేష్టలతో ప్రభుత్వం అప్రతిష్ట పాలు

### కోర్టును తప్పుదోవ పట్టించిన అధికారులను వెనకేసుకొస్తున్న కమిషనర్

### విచారణ పూర్తికాకముందే తిరిగి యధాస్థానం ఎలా కేటాయిస్తారు?

### ఫోర్జరీ సంతకాల కేసులో రూ. కోట్లు దండుకున్న కమిషనర్

### త్వరలోనే హరికిరణ్ మరో అవినీతి కుంభకోణాన్ని బయటపెడతాం

### బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



**హైదరాబాద్ సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ అవినీతి చేష్టలతో ప్రభుత్వం తీవ్ర అప్రతిష్ట పాలు అవుతుందని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ అవినీతి బాగోతాలు రోజుకొక్కటి బయటపడుతున్నాయని అన్నారు. ఇటీవలే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గంజాయి ఫోర్జరీ కేసు వ్యవహారంలో ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ పెద్ద ఎత్తున చేతివాటం ప్రదర్శించాడని విమర్శించారు. దాదాపు రూ. కోటి లంచం తీసుకొని ఫోర్జరీ సంతకాలు చేసిన అధికారులపై నామమాత్రపు చర్యలు తీసుకున్నాడని, భద్రాచలం సీఐని సస్పెండ్ చేసి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డిని మాత్రం అటాచ్ చేశారని, ఫోర్జరీ సంతకాల వ్యవహారంలో విచారణ పూర్తి కాకముందే మళ్ళీ శ్రీనివాస్ రెడ్డికి తిరిగి కొత్తగూడెం పోస్టింగ్ ఏ విధంగా ఇచ్చారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు ఫోర్జరీ చేయడమే కాకుండా న్యాయస్థానాన్ని సైతం తప్పుదోవ పట్టించిన అధికారులపై వెంటనే ఫోర్జరీ కేసు నమోదు చేయాలని, అదేవిధంగా త్వరితగతిన విచారణ పూర్తి చేసి, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫోర్జరీ వ్యవహారంపై త్వరలో హైకోర్టులో పిటిషన్ వేస్తామని, రెండు మూడు రోజుల్లో కమిషనర్ హరి కిరణ్ మరో రూ. 14 కోట్ల అవినీతి కుంభకోణాన్ని బయటపెడతామని అన్నారు. తీవ్ర అవినీతిలో కూరుకుపోయిన ఆయనకు రాష్ట్రం నుంచి సాగనంపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోటూరి రవీందర్ గౌడ్, చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు ముత్యాల వినోద్ సాగర్, మొయినాబాద్ మండల అధ్యక్షుడు శ్రీధర్, సిద్దార్థ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి మండల ఏర్పాటుపై కాంగ్రెస్ నేతలవి వాస్తవ విరుద్ధ వ్యాఖ్యలు

### 2023లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాథమిక గెజిట్ జారీ చేసింది: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్



**మల్లంపల్లి సెప్టెంబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ నాయకులు చరిత్రను వక్రీకరించి మాట్లాడటం సరికాదని బీఆర్ఎస్ మల్లంపల్లి మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ అన్నారు. మండల సాధన కోసం ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు చేసిన పోరాటాలను గౌరవించాల్సిందేనని తెలిపారు. 2023 సెప్టెంబర్ 23న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లంపల్లి మండల ఏర్పాటుకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి, కొత్త రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేసే ప్రక్రియను అధికారికంగా ప్రారంభించిందన్నారు. ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు కూడా అవకాశం కల్పించినట్లు తెలిపారు. 2024 నవంబర్ 28న తుది గెజిట్ వెలువడగా, మల్లంపల్లి, రామచంద్రాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని పది గ్రామాలతో మండలం ఏర్పాటైనట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాథమిక గెజిట్ ఇచ్చిన సమయంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకోవడంతో పాటు, అసెంబ్లీలో మంత్రి సీతక్క అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారని గుర్తు చేశారు. అలాంటప్పుడు ఇప్పుడు మండలాన్ని తామే సాధించినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మండల అభివృద్ధికి నిధులు కేటాయించి కార్యాలయాలు, రోడ్లు తదితర పనులు చేపడితే స్వాగతిస్తామని, అయితే ప్రస్తుత అభివృద్ధి పనులను చూపుతూ మండల ఏర్పాటు మొత్తం తమ ఘనతగా చెప్పుకోవడం సరికాదన్నారు. మల్లంపల్లి మండలం ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, ఇది ప్రజల చిరకాల ఆకాంక్ష అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో యువత పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని, భవిష్యత్తులో మరిన్ని చేరికలు ఉంటాయని శ్రీనివాస్ అన్నారు. మండల అభివృద్ధిపై రాజకీయ ఆరోపణలకు బదులుగా అధికారిక ఉత్తర్వులు, నిధుల మంజూరు, పూర్తయిన పనుల వివరాలతో మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, మల్లంపల్లి టౌన్ అధ్యక్షుడు చీదర సంతోష్, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, మండల యువజన అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్, వార్డు సభ్యుడు ఎండీ పాషా, బీఆర్ఎస్ నాయకులు మెరుగు రాజు, యువజన నాయకుడు కుక్కల సంపత్, కట్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జి. పోచయ్య తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో చేరిక..




**హనుమకొండ సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్)** :గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, వర్ధన్నపేట ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. పోచయ్య గారు ఈరోజు తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా చేరారు. ఈ విషయాన్ని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ గారు తెలియజేశారు. ఇంతకుముందు గవర్నమెంట్ డిగ్రీ కాలేజెస్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో జాయింట్ సెక్రటరీటూ గా బాధ్యతలు నిర్వహించిన ప్రొఫెసర్ జి. పోచయ్య గారు, ఆ పదవికి రాజీనామా సమర్పించి, తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా చేరారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, తెలంగాణలో కళాశాల విద్యను మరింత బలోపేతం చేయడం, కళాశాల విద్యా రంగంలో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సేవలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం, విద్యార్థులకు అవసరమైన కళాశాల మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రొఫెసర్ జి. పోచయ్య గారు అసోసియేషన్‌లో చేరడం వల్ల సంఘానికి మరింత బలం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. పోచయ్య గారికి హృదయపూర్వక స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ జే. చిన్న మరియు కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రవికుమార్, డాక్టర్ డి. వెంకన్న, సంఘ నాయకులు బి. రమేష్, ఎ. అనిల్ కుమార్, జి. శ్రీనివాస్, కె. శ్రీనాథ్, ఎ. వెంకటరమణ, కోమల, సమత, గౌరీ, లెంక సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జి. పోచయ్య గారికి స్వాగతం పలికి శుభాభినందనలు తెలిపారు.



# కొడకండ్ల రెసిడెన్షియల్ మహిళా ఫ్యాకల్టీకి వెంటనే నియామక ఉత్తర్వులు ఇవ్వాలి

- పరీక్షలు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా విధుల్లోకి తీసుకోరా?
- పాత పురుష ఫ్యాకల్టీనే కొనసాగించడంపై అభ్యంతరం
- ట్రైస్ సెక్రటరీకి తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వినతి



**హైదరాబాద్, సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** జనగామ జిల్లా కొడకండ్ల తెలంగాణ గురుకుల (ట్రైస్) విద్యాలయంలో 9 మంది అవుట్ సోర్సింగ్ మహిళా ఫ్యాకల్టీ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేసి, ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జెలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ట్రైస్ కార్యదర్శికి ఆయన లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కొడకండ్ల గురుకుల విద్యాలయంలో తొమ్మిది మంది మహిళా ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ కోసం జనగామ జిల్లా విద్యాశాఖ కార్యాలయం ద్వారా గత ఆగస్టు 17న పత్రికా ప్రకటన జారీ చేశారని తెలిపారు. సంబంధిత అధికారులు అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించి, ధ్రువపత్రాల పరిశీలన (సర్టిఫికెట్ వెరిఫికేషన్) కూడా పూర్తి చేశారని గుర్తుచేశారు. అయితే, ప్రభుత్వమే స్వయంగా పరీక్షలు నిర్వహించినప్పటికీ, ఎంపికైన మహిళా అభ్యర్థులను విధుల్లోకి తీసుకోకుండా గతంలో పనిచేసిన పురుష ఫ్యాకల్టీనే యథావిధిగా కొనసాగించడం విడ్డూరంగా ఉందని ఆయన ఆక్షేపించారు. అర్హులైన మహిళా అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా తాత్సారం చేయడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఈ అంశంపై స్పందించి, ఎంపికైన మహిళా ఫ్యాకల్టీకి తక్షణమే పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వరంగల్ విమానాశ్రయానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి

- పోరాటాల గడ్డ వరంగల్‌కు పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి ప్రతిబింబించాలి
- ఒక కులానికే కాదు.. బహుజన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడికి గౌరవం ఇవ్వాలి
- తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ డిమాండ్



**ములుగు( మల్లంపల్లి)సెప్టెంబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ అంటేనే పోరాటాల గడ్డ అని, ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఎన్నో చారిత్రక పోరాటాలకు ఈ నేల వేదికగా నిలిచిందని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. అలాంటి చారిత్రక పోరాటాల గడ్డపై ఏర్పాటు చేస్తున్న విమానాశ్రయానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాపన్న గౌడ్ ఒక కులానికే పరిమితమైన నాయకుడు కాదు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను కేవలం గౌడ కులానికి చెందిన నాయకుడిగా మాత్రమే చూడకూడదని అన్నారు. అణగారిన, వెనుకబడిన, బహుజన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం పోరాడిన యోధుడిగా ఆయనను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పిస్తూ, పాలనలో ప్రజలకు భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు.

# ఘనంగా చిన్ని బొజ్జ గణపయ్యకు ముగింపు పూజలు.. భారీ అన్నదానం



**ఉప్పుగూడ, సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పుగూడలోని సరిత టెక్స్‌టైల్స్ షోరూమ్ వద్ద కొలువుదీరిన 'చిన్ని బొజ్జ గణపయ్య' ముగింపు పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. గుండ్లపల్లి చంద్రమోహన్, జి. సరిత, శ్రేయల ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివారికి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్ణాహుతి, ముగింపు పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని షోరూమ్ ఎదుట భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఈ వితరణలో ఉప్పుగూడ, హనుమాన్ నగర్, దానయ్య నగర్, ఛత్రినాక, అంబికా నగర్, హనుమాన్ నగర్ ఫేజ్-2 తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం రాత్రి 9 గంటలకు వివిధ రకాల పూలతో నయనానందకరంగా అలంకరించిన ప్రత్యేక వాహనంలో స్వామివారి నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమైంది. బాజాభజంత్రీలు, చిన్నారుల కేరింతలు, "జై బోలో గణేష్ మహారాజ్ కీ జై", "గణపతి బప్పా మోరియా.. అగలే బరస్ తూ జల్దీ ఆ" నినాదాల మధ్య ఊరేగింపు కోలాహలంగా సాగింది. జల్పల్లి చెరువుకు చేరుకుని గణనాథుడిని ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుండ్లపల్లి షణ్ముఖ్, కాలే అమర్‌నాథ్, కాలే స్రవంతి, కాలే వర్ధన్, కాలే వికాస్ వర్ధన్, కాలే వంశీక, కందడి అనిల్ కుమార్, ప్రవీణ్ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.



# మా భూమిని కబ్జాదారుల నుంచి కాపాడండి

**• సర్వే నంబర్ 220/4లో 19 ఎకరాల 20 గుంటల భూమిపై వివాదం • 1986 నుంచి కొనుగోలు పత్రాలు ఉన్నాయని బాధితుల వెల్లడి • మాకు న్యాయం చేయండి .. బాధిత దంపతుల వేడుకోలు**








**ములుగు ( మల్లంపల్లి) సెప్టెంబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు మండలం ఏసునగర్ శివారులోని తమ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు, మైనింగ్‌కు సంబంధించిన వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ బత్తోజు పద్మ నరసింహాచారి దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.తమకు సంబంధించిన భూమిలోకి తామే వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. భూమికి సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. **సర్వే నంబర్ 220/4లో భూమి**బాధితురాలు బత్తోజు పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఏసునగర్ శివారులోని సర్వే నంబర్ 220/4లో 30 ఎకరాల భూమిని తాము కొనుగోలు చేసినట్లు తెలిపారు.అందులో 10 ఎకరాల భూమిని విక్రయించగా ప్రస్తుతం తమ వద్ద 19 ఎకరాల 20 గుంటల భూమి మిగిలి ఉందన్నారు.ఈ భూమికి సంబంధించి తమ వద్ద కొనుగోలు పత్రాలు,ఇతర సంబంధిత రికార్డులు ఉన్నాయని తెలిపారు.అయితే కొందరు ప్రైవేట్ వ్యక్తులు,మైనింగ్‌కు సంబంధించిన వ్యక్తులు తమ భూమిపై హక్కు ఉన్నట్లుగా వ్యవహరిస్తూ తమను భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. **తమకు వ్యతిరేకంగా పత్రాలు సృష్టించారని ఆరోపణ**తమ భూమి విషయంలో కొందరు తమకు వ్యతిరేకంగా పత్రాలు సృష్టించి,భూమి తమదేనంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పద్మ ఆరోపించారు.తాము కష్టపడి సంపాదించిన డబ్బుతో,కుటుంబ సభ్యుల సహకారంతో భూమిని కొనుగోలు చేశామని తెలిపారు.ప్రస్తుతం తమకు సంబంధించిన భూమిలోకి తామే వెళ్లలేని పరిస్థితి ఏర్పడటం బాధాకరంగా ఉందన్నారు.భూమిపై తమ హక్కులను కాపాడాలని అధికారులను కోరారు. **పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఫెన్సింగ్ ఏర్పాటు**భూమి వివాదంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బత్తోజు పద్మ తెలిపారు.వివాదం పరిష్కారమయ్యే వరకు ఇరువర్గాలు భూమిలోకి వెళ్లకూడదని పోలీసులు సూచించినట్లు పేర్కొన్నారు.తాము పోలీసుల సూచనను పాటిస్తూ భూమిలోకి వెళ్లకుండా ఉన్న సమయంలో కొందరు వ్యక్తులు తమ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని ఆరోపించారు.దీంతో తమ భూమిపై హక్కు ఉన్నప్పటికీ దానిని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. **కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆందోళన**భూమి వివాదం కారణంగా తమ కుటుంబ సభ్యుల్లో భయాందోళనలు నెలకొన్నాయని పద్మ నరసింహాచారి దంపతులు తెలిపారు.తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.తమ భూమి విషయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని,తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. **1986 నుంచి కొనుగోలు పత్రాలు ఉన్నాయంటున్న బాధితులు** బత్తోజు నరసింహాచారి మాట్లాడుతూ తమ భూమికి సంబంధించి 1986 నుంచి కొనుగోలు పత్రాలు ఉన్నాయని తెలిపారు.అలాగే 2004లో కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన పత్రాలు కూడా తమ వద్ద ఉన్నాయని చెప్పారు. భూమికి సంబంధించిన అధికారిక రికార్డులు తమ వద్ద ఉన్నప్పటికీ కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి భూమిపై హక్కు కలిగినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. **రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్త విచారణ చేయాలి** తమ భూమికి సంబంధించిన అన్ని పత్రాలను పరిశీలించి, రెవెన్యూ రికార్డులు,రిజిస్ట్రేషన్ పత్రాలు,సర్వే వివరాలను సమగ్రంగా పరిశీలించాలని బాధితులు కోరారు.రెవెన్యూ అధికారులు,పోలీసు అధికారులు సమన్వయంతో విచారణ చేపట్టి భూమికి సంబంధించిన వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.ఎవరి వద్ద చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయో అధికారికంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. **ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వేడుకోలు** తమ భూమి విషయంలో ఏర్పడిన వివాదాన్ని అధికారులు వెంటనే పరిష్కరించాలని బాధిత దంపతులు కోరారు.భూమిపై అక్రమంగా జోక్యం చేసుకునే ప్రయత్నాలను అడ్డుకుని,తమ హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.తమ కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు భూమిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ప్రభుత్వానికి,జిల్లా అధికారులను,పోలీసు అధికారులను బత్తోజు పద్మ నరసింహాచారి దంపతులు విజ్ఞప్తి చేశారు.

# అర్చక పరీక్షలు త్వరితగతిన నిర్వహించాలి: గట్టు శ్రీనివాసాచార్యులు

**తెలంగాణ ఆలయాల్లో ఆగమ పండితుల నియామకం, అర్చకులకు ప్రమోషన్లు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని కమిషనర్‌కు వినతి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో అర్చక ఆగమ పరీక్షలను త్వరితగతిన నిర్వహించాలని, రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో దేవాదాయ ధర్మాదాయ శాఖ తరఫున ఆగమ పండితులను నియమించాలని కోరుతూ తెలంగాణ అర్చక సమాఖ్య, భాగ్యనగర అర్చక పురోహిత సంఘం ప్రతినిధులు దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులకు పదోన్నతులు కల్పించడంతో పాటు, వారికి అవసరమైన ఇతర సౌకర్యాలను అందించాలని ప్రతినిధులు కోరారు. అదేవిధంగా అర్చకులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కూడా వర్తింపజేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.తెలంగాణలో అర్చక ఆగమ పరీక్షలు ఆలస్యం కాకుండా త్వరగా నిర్వహించడం ద్వారా అర్హులైన అర్చకులకు అవకాశాలు కల్పించాలని వారు కోరారు. ప్రధాన ఆలయాల్లో ఆగమ శాస్త్ర పరిజ్ఞానం కలిగిన పండితుల నియామకం ద్వారా ఆలయాల్లో ఆగమ సంప్రదాయాలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు.అర్చకుల సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై కమిషనర్‌తో ప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గట్టు శ్రీనివాసాచార్యులు, అర్చక సమాఖ్య కన్వీనర్ పరాశం రవీంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిష్టాపన

**• గణపతి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా • తొమ్మిదవ రోజు ఘనంగా కుంకుమ పూజ • ఏటూరునాగారం బస్టాండ్ ఆవరణలో భక్తిశ్రద్ధలతో పూజలు • పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు**



**ములుగు జిల్లా ఏటూరునాగారం సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సేవా యువజన సంఘం వారి ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిష్టాపన చేసి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు కుంకుమ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.అయ్యగారు ఎల్లాప్రగడ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుని ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో సేవా యువజన సంఘం అధ్యక్షులు లింగాచారి, ఉపాధ్యక్షులు బండారి లక్కీ, గౌరవ సలహాదారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళల పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో బస్టాండ్ ఆవరణలో భక్తిమయ వాతావరణం నెలకొంది

# ప్రొఫెసర్ జి. పోచయ్య తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో చేరిక..





**హనుమకొండ సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, వర్ధన్నపేట ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. పోచయ్య గారు ఈరోజు తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా చేరారు. ఈ విషయాన్ని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ తెలియజేశారు.ఇంతకుముందు గవర్నమెంట్ డిగ్రీ కాలేజెస్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో జాయింట్ సెక్రటరీటూ గా బాధ్యతలు నిర్వహించిన ప్రొఫెసర్ జి. పోచయ్య గారు, ఆ పదవికి రాజీనామా సమర్పించి, తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా చేరారు.ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, తెలంగాణలో కళాశాల విద్యను మరింత బలోపేతం చేయడం, కళాశాల విద్యా రంగంలో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సేవలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం, విద్యార్థులకు అవసరమైన కళాశాల మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ప్రొఫెసర్ జి. పోచయ్య గారు అసోసియేషన్‌లో చేరడం వల్ల సంఘానికి మరింత బలం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రొఫెసర్ జి. పోచయ్య గారికి హృదయపూర్వక స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ జే. చిన్న మరియు కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రవికుమార్, డాక్టర్ డి. వెంకన్న, సంఘ నాయకులు బి. రమేష్, ఎ. అనిల్ కుమార్, జి. శ్రీనివాస్, కె. శ్రీనాథ్, ఎ. వెంకటరమణ, కోమల, సమత, గౌరీ, లెంక సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జి. పోచయ్య గారికి స్వాగతం పలికి శుభాభినందనలు తెలిపారు.

# రేకుర్తి కంటి ఆసుపత్రిలో 300 మొక్కలు నాటిన లయన్స్ క్లబ్..



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 22(పిసి డబ్ల్యూ న్యూస్):** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఎన్విరాన్మెంట్ సర్వీస్ వీక్ కార్యక్రమాలు కరీంనగర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడెకర్ ఉదారి కంటి ఆసుపత్రి ఆవరణలో జిల్లా గవర్నర్ మోర భద్రేశం ఆధ్వర్యంలో 300 మొక్కలను నాటారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా GAT ఏరియా లీడర్ ఆవుల గోపాల్‌రావు, మల్టిపుల్ డిస్ట్రిక్ట్ GST కో-ఆర్డినేటర్ తీగల మోహన్‌రావు, మల్టిపుల్ కౌన్సిల్ సెక్రెటరీ సింహరాజు కోదండరాములు హాజరయ్యారు. జిల్లా అటవీ అధికారి సత్యనారాయణ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆవుల గోపాల్‌రావు మాట్లాడుతూ.. లయనిజం అంటే ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడమని అన్నారు. మానవ మనుగడ కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు.జిల్లా అటవీ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. తెలంగాణవ్యాప్తంగా వారం రోజుల పాటు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. లయన్స్ క్లబ్‌కు అటవీ శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఉదారి చంద్రమోహన్, ప్రకాష్ హొల్లా, చిదుర సురేష్, కొండా వేణుమూర్తి, అనంతుల శివప్రసాద్, ముద్దసాని ప్రమోద్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ విజయ, కోలా అన్నారెడ్డి, వల్లాల కృష్ణహరి, రేకులపల్లి శశాంక్, ఇనుగుర్తి రమేష్, అరికెళ్ల రాజయ్య, గుండోజు లక్ష్మయ్య, దామోదర్‌తో పాటు జిల్లా క్యాబినెట్ సభ్యులు, రీజియన్, జోన్ చైర్మన్లు, వివిధ లయన్స్ క్లబ్‌ల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# అశోక్ నగర్‌లో ఘనంగా అన్నప్రసాద వితరణ.. ఘనంగా కార్పొరేటర్ ఉమారాణి జన్మదిన వేడుకలు

**- ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ కోలగాని శ్రీనివాస్..**





**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ లో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రోజున అన్నప్రసాద వితరణ చేపట్టారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. **కార్పొరేటర్ ఉమారాణి జన్మదిన వేడుకలు** అన్నప్రసాద వితరణ కార్యక్రమం అనంతరం డివిజన్ కార్పొరేటర్ ఉమారాణి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో మేయర్ కోలగాని శ్రీనివాస్ ప్రత్యేకంగా పాల్గొని, కేక్ కట్ చేయించి, . కార్పొరేటర్ ఉమారాణికి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

**- క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**





**కరీంనగర్, సెప్టెంబర్22(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిలతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరుతూ మొత్తం 145 దరఖాస్తులు సమర్పించారు. వీటిలో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 37 దరఖాస్తులు, కరీంనగర్ నగరపాలక సంస్థకు సంబంధించి 32 దరఖాస్తులు అందాయి. ప్రజల సమస్యలను అధికారులు బాధ్యతగా స్వీకరించి, సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిం చాలని కలెక్టర్ సూచించారు. ప్రతి దరఖాస్తుపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుని, నిర్ణీత సమ యంలోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ పోరాటం వల్లే చింతకుంట కెనాల్‌కు నీటి విడుదల

**- కాంగ్రెస్ తీరుపై బీజేపీ విమర్శలు**




**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని చింతకుంట కెనాల్ వద్ద వినాయక చవితి నిమజ్జన కార్యక్రమం కోసం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, బీజేపీ శ్రేణులు మరియు హిందూ సంఘాలు చేపట్టిన ధర్నా పోరాటం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి నీటిని విడుదల చేసిందని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి గుంజేటి శివకుమార్ స్పష్టం చేశారు. కొత్తపల్లి మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లో ఏళ్లుగా జరుగుతున్న వినాయక నిమజ్జన ప్రాంతమైన చింతకుంటను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, పోలీస్ కమిషనర్లతో కలిసి సందర్శించి, నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారని గుర్తుచేశారు. నిమజ్జనానికి కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నప్పటికీ అధికారులు నీరు విడుదల చేయకపోవడాన్ని తప్పుపడుతూ, హిందూ సంఘాలు మరియు బీజేపీ కార్యకర్తలు సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారన్నారు. ఈ ప్రజా పోరాట ఫలితంగానే ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని తెలిపారు. బీజేపీ సాధించిన ఈ విజయానికి వస్తున్న మైలేజీని ఓర్వలేకనే స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్ మరియు కాంగ్రెస్ నాయకులు వచ్చి “మా వల్లనే జరిగిందని“ గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు, గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు హిందువుల పండుగలను చిన్నచూపు చూశాయని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ కార్పొరేషన్ మేయర్ బాధ్యతలు చేపట్టాక రెట్టింపు నిధులతో, మరింత ఉత్సాహంతో ఉత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఎల్లప్పుడూ హిందువులకు అండగా నిలిచేది బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరు హరీష్, కొత్తపల్లి మండల అధ్యక్షులు కుంట తిరుపతి, ఎస్టీ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస నాయక్, ఓబీసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచకొండ కొమురయ్య, జిల్లా నాయకులు జిట్టవేణి రేణు, శ్రీనివాస్ నాయక్, బుస అనిల్ కుమార్, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

# చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ‘నషా ముక్త్ భారత్ అభియాన్‘ అవగాహన ప్రోగ్రాం....

**చిగురుమామిడి సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజు చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ‘నషా ముక్త్ భారత్ అభియాన్‘ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి జయప్రద ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత, మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ సుందరగిరి సాయికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. డ్రగ్స్ , మత్తు పదార్థాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబంపై, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి వివరంగా వివరించారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా పూర్తిగా దూరంగా ఉండాలని




సూచించారు. సోషల్ మీడియాను అత్యంత జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోకూడదని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు లేదా ఇతర సమాచారాన్ని ఎవరికీ ఇవ్వకూడదని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద సందేశాలు, లింకులు మరియు వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులను సులభంగా నమ్మవద్దని, ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మొత్తంగా, విద్యార్థులు డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పూర్తి ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు

**- ఆకుల వారి ఘనపూర్ 13వ వార్డులో ఘనంగా అన్నదానం**

**ములుగు జిల్లా, ఏటూరునాగారం సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఆకుల వారి ఘనపూర్ 13వ వార్డులో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న వినాయకుడి ఉత్సవాలు ముగియడంతో ఈ సందర్భంగా భక్తులు, స్థానికులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో చిన్నపెల్లి సిద్ధు, బోగిరి బాలకృష్ణ, సాగర్, రాజేందర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, 13వ వార్డు సభ్యురాలు అక్షయ,



సీహెచ్ రాజు, ముత్తయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడంలో మహిళల పాత్ర ప్రత్యేకంగా నిలిచింది. గల్లీలోని మహిళలు ఎంతో శ్రమించి వంట కార్యక్రమాలను చేపట్టి, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. బోగిరి స్వప్న, ధనలక్ష్మి, స్వప్న, అపర్ణ, జోష్ణ, నాగమణి, స్వప్న తదితర మహిళలు ఉదయం నుంచే ఏర్పాట్లలో పాల్గొని వంటలు తయారు చేసి, వచ్చిన భక్తులకు ఆప్యాయంగా భోజనం వడ్డించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించి, చివరి రోజు అన్నదానం చేయడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి భక్తి, సేవాభావంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా అన్నదాన ఏర్పాట్లలో ముందుండి కష్టపడ్డ మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వినాయకుని నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు....

**ఏర్పాట్లను పరిశీలించిన కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్....**

**మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు చేసిన అధికారులు..**

**కమలాపూర్ సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద గణేష్ నిమజ్జానానికి కమలాపూర్ గ్రామ సర్పంచ్ పప్పు సతీష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వినాయకుని నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ సన్నద్ధమైంది. కమలాపూర్ మండల కేంద్రంలో 60కి పైగా గణేష్



విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపడుతున్నామని కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ తెలిపారు. గణేష్ ని నిమజ్జనం ప్రారంభం నుంచి పూర్తయ్య వరకు ట్రాఫిక్ సమస్యలు లైటింగ్ పారిశుద్ధ్యం పై శ్రద్ధ వహిస్తూ గ్రామపంచాయతీ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో పోలీస్ సూచనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని సర్పంచ్ కోరారు. కమలాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో బుధ గురువారం వినాయక నిమజ్జనాలు కొనసాగుతాయని నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు సిఐ నవీన్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ నవీన్ యాదవ్ కమలాపూర్ పంచాయతి కార్యదర్శి గృహ నిర్మాణ శాఖ ఏఈ నరేష్ పోలీస్ శాఖ సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ‘యశోద’లో బోన్‌మారో వ్యాధులకు అత్యాధునిక వైద్యం

**● నెలలో ఏడు సార్లు రక్తం.. ప్రాణం కోసం పోరాటం ● ప్రాణాపాయ స్థితిలో 64 ఏళ్ల వ్యక్తికి వైద్యుల భరోసా ● మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఫరాజ్ అహ్మద్**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తరచూ జ్వరం, తీవ్రమైన నీరసం, ఒళ్లు నొప్పులు.. రోజురోజుకూ క్షీణిస్తున్న ఆరోగ్యం.. చివరకు ప్రాణాలను నిలబెట్టుకోవడానికి పదేపదే రక్తం ఎక్కించుకోవాల్సిన పరిస్థితి. ఇలాంటి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఖమ్మంకు చెందిన 64 ఏళ్ల వ్యక్తికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక సమగ్ర వైద్య సేవలు అందించి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచినట్లు వైద్యులు తెలిపారు. ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. నెల రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులు, తీవ్రమైన నీరసంతో బాధపడుతున్న వ్యక్తికి ఆసుపత్రికి వచ్చేలోపే ఒక్క నెలలో ఏడు యూనిట్ల ప్యాక్డ్ రెడ్ బ్లడ్ సెల్స్ (పీఆర్‌బీసీ) ఎక్కించాల్సి వచ్చిందన్నారు. రక్తం అవసరం పదేపదే రావడానికి కారణం తెలియక కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు. యశోదా ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షల్లో రక్తహీనత (అనీమియా), ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోవడం




(థ్రాంబోసైటోపీనియా)తో కూడిన బైసైటోపీనియా ఉన్నట్లు గుర్తించామన్నారు. పెరిఫెరల్ బ్లడ్ స్మియర్‌లో అసాధారణ రక్త చిత్రణ కనిపించిందన్నారు. వ్యాధి మూలాన్ని తెలుసుకునేందుకు బోన్‌మారో ఆస్పిరేషన్, బోన్‌మారో బయాప్సీ నిర్వహించగా ప్రైమరీ మైలోఫైబ్రోసిస్ (పీఎంఎఫ్) ఉండవచ్చనే సూచనలు కనిపించాయని తెలిపారు. తుది నిర్ధారణకు తదుపరి పరీక్షలు, నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. పీఎన్‌హెచ్ ప్యానెల్ నెగెటివ్‌గా వచ్చినట్లు చెప్పారు. రోగికి మరో మూడు యూనిట్ల ల్యూకోడెప్లీటెడ్ పీఆర్‌బీసీ అందించామని తెలిపారు. చికిత్స సమయంలో ఆయాసం, జ్వరం, రక్తంలోని ఆక్సిజన్ స్థాయి తగ్గడంతో ఐసీయూకు తరలించి బ్రాడ్-స్పెక్ట్రమ్ యాంటీబయాటిక్స్, సపోర్టివ్ కేర్ అందించామన్నారు. అనంతరం స్టెరాయిడ్స్, ఇమిడ్స్, ఇంజెక్టబుల్ ఈపీఓ తదితర చికిత్సలు ప్రారంభించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడి పరిస్థితి స్థిరపడిందన్నారు. అనీమియా, ప్లేట్‌లెట్ల తగ్గుదలతో పాటు పదేపదే రక్తం అవసరమయ్యే రోగుల్లో అసలు కారణాన్ని గుర్తించడం అత్యంత ముఖ్యమని డాక్టర్ ఫరాజ్ అహ్మద్ తెలిపారు. అవసరమైన సందర్భాల్లో బోన్‌మారో ఆస్పిరేషన్, బయాప్సీ వంటి పరీక్షలు వ్యాధి మూలాన్ని గుర్తిం చడంలో కీలకమన్నారు. తరచూ రక్తం ఎక్కించు కోవాల్సి రావడం, కారణం తెలియని రక్తహీనత, ప్లేట్‌లెట్లు తగ్గిపోవడం, నిరంతర జ్వరం, తీవ్రమైన నీరసం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా నిపుణుల వైద్య సలహా తీసుకోవాలని సూచించారు. బోన్‌మారో, రక్త సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో హీమటాలజీ, హీమటో- ఆంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగాల సమన్వయం కీలకమని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మలక్‌పేట్ యశోదా ఆసుపత్రి అసిస్టెంట్ మేనేజర్ వాసు కిరణ్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

PCW తెలుగు దినపత్రిక

బుధవారం 23 సెప్టెంబర్ 2026

# అలుగునూర్లో గణనాధులను దర్శించుకున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..

**• ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మేయర్..**

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం 8వ డివిజన్ అలుగునూరు లోకొలువుదీరిన గణనాధులను మంగళవారం రాత్రి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ దర్శించుకున్నారు. అల్గునూరులోని కౌండిన్య యూత్, విశ్వామిత్ర యూత్, మహాలక్ష్మికి గణపతి యూత్, లిటిల్ స్టార్స్ యూత్, మున్నూరుకాపు సంఘం, శ్రీ వెంకటేశ్వర కాలనీ శ్రీ పంచముఖ హనుమాన్ యూత్ ల ఆధ్వర్యంలో అల్గునూరులోనీ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వినాయకులను మేయర్ కోలగాని శ్రీనివాస్ దర్శించి, వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుడిని మేయర్ ప్రార్థించారు ..ఈ పవిత్ర వేడుకలో భాగంగా ఆయా ప్రాంతాల నిర్వాహకులు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌ను సాదరంగా ఆహ్వానించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అలుగునూరులోని ఆయా ప్రాంతాల నిర్వాహకులతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ



నాగేశ్వర్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధిబొంతల కళ్యాణ్ చంద్ర, బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షులు దుర్శెట్టి సంపత్, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి , బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్ , ఓదెలు, బిజెపికంటెస్టెంట్ కార్పొరేటర్ తోర్తి సంతోష్ , వెల్పుల నరేష్ ముంజా ప్రశాంత్ బుర్ర నరేష్ ముంజా ప్రవీణ్ ,కార్లే వినయ్ కత్తి రాకేష్, బుర్ర మహేందర్ ముంజా లక్ష్మణ్ , ముంజా అనిల్ , ముంజా రాకేష్ బైరి రాజు, బాతిని అభి బుర్ర కళ్యాణ్, ముంజా సాయి, పల్లవి బుర్ర సురేందర్ బాతిని శ్రావణ్ కుమార్, కత్తి హరీష్ బాతిని సందీప్, శ్రీ పంచముఖ హనుమాన్ యూత్ సభ్యులు:ప్రశాంత్, చిందం అంజి, సంతోష్ కుమార్, సాయికుమార్, అక్షయ్ కుమార్, కొత్తూరి శ్రీనివాస్, చిందం మనోహర్, తిరుపతి పెండ్యాల నాగరాజు, పెండ్యాల సాయి, చిందం సాయి, ఐతం గణేష్, ఐతం నందన్, కృష్ణ, స్వానిక్ కుమార్, ప్రీతం, వరాల సాయి వంశీ, రామ్ చరణ్, సాయి హర్షిత్, రేణి, మాధవ్, రేవంత్, మనోహర్, విద్యాధరన్, వెంకటేష్, సాయి లికిత్, రాజీవ్ పటేల్ శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయ కమిటీ బాధ్యులుసల్ల రాజయ్య, సిరిపురం శ్రీనివాస్, రాజిరెడ్డి, సుధాకర్ రెడ్డి, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధనతో... డాక్టరేట్

**• వెంగన్నపేట బిడ్డకు అరుదైన గౌరవం**

**• తల్లిదండ్రులకు పట్టా అంకితం చేసిన డా. గాంధీబాబు**



**తల్లాడ, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లాడ మండలం వెంగన్నపేట గ్రామానికి చెందిన డా. ఎస్. గాంధీబాబు పరిశోధన రంగంలో విశేష ప్రతిభ కనబరిచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు ఉన్నత విద్యలో సాధించిన ఈ ఘనత పట్ల వెంగన్నపేట గ్రామస్తులు, బంధుమిత్రులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ గాంధీబాబును అభినందించారు.పరిశోధన పట్ల ఆసక్తితో నిరంతరం శ్రమించిన గాంధీబాబు తన విద్యా ప్రయాణంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ డాక్టరేట్ స్థాయికి చేరుకున్నారు. పట్టా అందుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విద్యాభ్యాసం, పరిశోధనలో తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం, సహకారం ఎంతో కీలకమని అన్నారు.తనకు లభించిన డాక్టరేట్ పట్టాను తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు డా. గాంధీబాబు తెలిపారు. వారి ఆశీస్సులు, కుటుంబ సభ్యులు, గురువులు అందించిన ప్రోత్సాహమే ఈ విజయానికి కారణమని అన్నారు.వెంగన్నపేట వంటి గ్రామీణ ప్రాంతం నుంచి ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. గాంధీబాబు మరిన్ని పరిశోధనలు చేపట్టి విద్యా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# కౌన్సిలర్ రామకృష్ణకు ఘన సన్మానం




**కల్లూరు, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలోని 4వ వార్డు ప్రజలు 18వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గణేష్ నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించేందుకు రామకృష్ణ అక్కడికి వెళ్లారు.ఈ సందర్భంగా 4వ వార్డు ప్రజలు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. వార్డు ప్రజల ఆత్మీయతకు పుర కౌన్సిలర్ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట కొటికలపూడి కళ్యాణ్ కిషోర్ డబల్ బెడ్ రూమ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# నాటి జీవనశైలే వారిని ఆయుష్మంతులను చేసింది!

**- రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాధిక్ ఆలీ**

**- అనారోగ్యాల్లేకుండా ప్రశాంతంగా దివికేగిన అజ్మీరా సుక్కమ్మకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఘన నివాళులు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నాటి తరం మనుషులు పాటించిన ఆహారపు అలవాట్లు, సహజసిద్ధమైన ఆరోగ్యకరమైన జీవనశైలే వారిని నూరేళ్ల పాటు ఎలాంటి హానికరమైన జబ్బులు లేకుండా ఆరోగ్యవంతంగా ఉంచాయని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాధిక్ ఆలీ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలం, కసనా తండాకు చెందిన వృద్ధురాలు అజ్మీరా సుక్కమ్మ (85) సోమవారం రాత్రి స్వగృహంలో శాంతియుతంగా కన్నుమూశారు. ఆమె మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు



తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ, ఆమె భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సయ్యద్ సాధిక్ ఆలీ మాట్లాడుతూ.. "ఆధునిక ప్రపంచంలో యంత్రాల జీవితం, కల్తీ ఆహారంతో నేటి తరం చిన్న వయస్సులోనే అనేక రోగాల బారిన పడుతుంటే, నాటి తరం పెద్దలు కష్టపడే తత్వంతో, సాత్వికమైన సహజ ఆహార అలవాట్లతో నూరేళ్ల పాటు ప్రశాంతమైన, సంతోషకరమైన జీవితాన్ని గడిపారు. జీవితాంతం మంచాన పడకుండా, ఎవరికీ భారం కాకుండా ప్రశాంతంగా తుది శ్వాస విడిచే అదృష్టం సుక్కమ్మకి దక్కడం ఆమె పాటించిన ఆదర్శవంతమైన జీవనవిధానానికే నిదర్శనం. నేటి సమాజానికి, భవిష్యత్తు తరాలకు నాటి మనుషుల ఆచారవ్యవహారాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో ఆవశ్యకం, ఆదర్శనీయం" అని మానవీయ కోణంలో వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. నేటి తరం ఎటువంటి జబ్బులు లేకుండా 85 ఏండ్లు జీవించడం అసాధ్యం అన్నారు. అందుకే వారు నేటి తరానికి ఆదర్శం అన్నారు. అమరజీవి సుక్కమ్మకి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకు నాయకులు తమ లోతైన సానుభూతిని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీ భాస్కర్ రావు, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్, జగన్, కిషన్, రాంకోటి, జగన్నాథం, భానోత్ సక్రం, భీమా, బాబు, గ్రామ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ శేషజీవికి కన్నీటి వీడ్కోలు పలికారు.

# సంపూర్ణ మద్యపాన నిషేధంపై జిల్లా కలెక్టరేట్ ముందు మహిళలు ధర్నా......

**• అక్టోబర్ 2న మహిళల ధర్నాను విజయవంతం చేద్దాం..**

**• కమలాపూర్ మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు గోల్కొండ శ్రీకాంత్ మాదిగ..**



**కమలాపూర్ సెప్టెంబర్ 22(పిసి డబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోల్కొండ శ్రీకాంత్ మాదిగ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ అక్టోబర్ 2న కలెక్టరేట్ ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం పై మహిళల ఉద్యమం ధర్నా కార్యక్రమం అక్టోబర్ 7న అమరావతిలో జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఇంచార్జ్ ఏవూరి వెంకటేశ్వరరావు జిల్లా కో ఇంచార్జ్ తడుగుల విజయ్ మాదిగ మండల ఇంచార్జ్ శనిగరపు రవీందర్ మాదిగ ఎం ఎస్ పి మండల అధ్యక్షులు శనిగరపు చేరాలు అధికార ప్రతినిధి పుల్లా రవితేజ మాదిగ ఎంఎస్ పి అధికార ప్రతినిధి కుమ్మరి ఎలియా మాదిగ సీనియర్ నాయకులు జే రిపోతుల బిక్షపతి అకినపల్లి రమేష్ అకినపల్లి రామ్మూర్తి పూర్ణచందర్ నద్దునూరి ప్రసాద్ రత్న రాజేష్ గుంపుల జైపాల్ అకినపల్లి సారయ్య అకినపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వ మతాల సందేశం మానవాళి సంక్షేమమే..

**• గణేష్ ఉత్సవాలు ఐక్యతకు వారధిగా నిలవాలి • సర్వ మానవాళికి ఆ విఘ్నేశ్వరుడి దీవెనలు ఉండాలి • టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గణనాథుడి సన్నిధిలో ఎస్.వి రెడ్డి – శైలజ దంపతుల కుంకుమ పూజ భక్తి, ఆధ్యాత్మికతతో శ్రీనివాసనగర్, ప్రకాశ్ నగర్ ప్రాంతం పులకించింది. విగ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గణనాథుడి సన్నిధిలో కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ... సర్వ మతాల లక్ష్యం మానవాళి సంక్షేమమేనని, కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజలంతా ప్రేమ, శాంతి, సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు ప్రతి సంవత్సరం భూమిపైకి వచ్చి భక్తుల పూజలను అందుకుంటాడనే విశ్వాసం ఉందన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయు రారోగ్యాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యత, సోదర భావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే వేదికలుగా నిలవాలని ఖదీర్ సూచించారు. జర్నలిస్టు ఎస్వీ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం అభినందనీయమని ఆయన అన్నారు. గణనాథుడి





సన్నిధిలో మెట్రో ఈవెనింగ్ పత్రిక బ్యూరో టీడబ్ల్యూజెఎఫ్ నాయకులు ఎస్.వి.రెడ్డి తనయ వేదశ్రీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టు ఎస్వీ రెడ్డి కుమార్తె వేదశ్రీ కేక్ కట్ చేసి భక్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్, సీనియర్ జర్నలిస్ట్ టి.ఎస్ చక్రవర్తి వేదశ్రీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు వేదశ్రీకి ఆశీస్సులు అందించారు. టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానీపాషా, జర్నలిస్టు నేతలు ఎస్.వి.రెడ్డి, రోశిరెడ్డి, మురళి, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో వడ్డే నాగయ్య చిరస్మరణీయుడు

**• తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్**

**• వడ్డే రామారావు కుటుంబానికి టిడబ్ల్యూజేఎఫ్ భరోసా**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా సేవకు జీవితాన్ని అంకితం చేసిన వడ్డే నాగయ్య చిరస్మరణీయుడని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ అన్నారు. తండ్రిని కోల్పోయిన విషాద సమయంలో సీనియర్ జర్నలిస్టు వడ్డే రామారావు కుటుంబానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) అండగా నిలిచింది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వడ్డే నాగయ్య కుటుంబాన్ని మంగళవారం రాత్రి ఫెడరేషన్ ఖమ్మం జిల్లా నాయకులు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ నేతృత్వంలో రమణగుట్టలోని వడ్డే రామారావు నివాసానికి చేరుకున్న టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు.. వడ్డే నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామారావుతో పాటు కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పరామర్శించి, దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని కోరారు.జర్నలిజం రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన వడ్డే రామారావు సూచనలు, సలహాలు యువ జర్నలిస్టులకు ఎంతో విలువైనవని సయ్యద్ ఖదీర్ అన్నారు. తన అనుభవంతో కొత్త తరానికి మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. వడ్డే నాగయ్య మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన నాయకులు.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విషాదంలో ఉన్న కుటుంబానికి పలువురు జర్నలిస్టు నాయకులు ఆత్మీయంగా అండగా నిలవడం అక్కడి వాతావరణాన్ని భావోద్వేగానికి గురిచేసింది. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోష్ చక్రవర్తి, జిల్లా సహాయ కార్యదర్శి యాకేష్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానీ పాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, యూనియన్ నాయకులు ఎస్వీ రెడ్డి, రోశిరెడ్డి, మురళి, కుంభం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణం సొంతమాయె



## ఫైనల్లో శ్రీలంకపై భారత్ ఘన విజయం

### ఆసియా క్రీడల మహిళల క్రికెట్

నాగోయ (జపాన్) : ఆసియా క్రీడల్లో భారత మహిళలు తొలి స్వర్ణం సాధించారు. టీ20 ఫార్మాట్‌లో జరిగిన టోర్నమెంట్‌లో తిరుగులేని విజేతగా నిలిచారు. మంగళవారం జరిగిన ఫైనల్లో శ్రీలంకపై భారత్ 147 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. భారత్ తొలుత 20 ఓవర్లలో 3 వికెట్లకు 216 పరుగులు చేయగా, ఛేదనలో శ్రీలంక 15.4 ఓవర్లలో 69 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసియా క్రీడల్లో పసిడి పతకం టీమ్ ఇండియా అమ్మాయిల సొంతమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు టాప్ ఆర్డర్ భారీ స్కోరు అందించింది. ఓపెనర్లు స్మృతీ మంధాన (79, 45 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సులు), షెఫాలీ వర్మ (48, 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు), రిచా ఘోష్ (49 నాటౌట్, 22 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. మంధాన ఏడు సిక్సర్లు, ఐదు ఫోర్లతో అర్థ సెంచరీ బాదింది. షెఫాలీ వర్మ తనదైన శైలిలో మూడేసి సిక్సులు, ఫోర్లతో దండెత్తింది. రిచా ఘోష్ డెత్ ఓవర్లలో అదిరే ముగింపు అందించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (19, 17 బంతుల్లో 3 ఫోర్లు) నిరాశపరిచింది. భారీ ఛేదనలో శ్రీలంక అమ్మాయిలు చతికిల పడ్డారు. భారత బౌలర్లు దీప్తి శర్మ (3/6), షెఫాలీ వర్మ (2/3), శ్రేయాంక పాటిల్ (2/9), శ్రీ చరణి (2/13) వికెట్ల వేటలో విజృంభించారు. దీంతో 15.4 ఓవర్లలోనే శ్రీలంక మహిళలు 69 పరుగులకు ఆలౌటయ్యారు. కెప్టెన్ చమరి ఆటపట్టు (29, 21 బంతుల్లో 5 ఫోర్లు) మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ చెప్పుకోదగిన ప్రదర్శన కనబరచలేదు. 147 పరుగులతో భారీ విజయం సాధించిన భారత్ స్వర్ణం సొంతం చేసుకోగా.. శ్రీలంక రజత పతకంతో సరిపెట్టుకుంది.

**బ్యాడ్మింటన్‌లో పతకం ఖాయం** బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు పతకం ఖాయం చేసింది. మంగళవారం జరిగిన మెన్స్ టీమ్ ఈవెంట్ క్వార్టర్‌ఫైనల్లో ఆతిథ్య జపాన్‌పై 3–0తో భారత్ ఘన విజయం సాధించింది. జపాన్‌పై విజయంతో ఆసియా క్రీడల్లో 40 ఏండ్ల తర్వాత మెన్స్ జట్టు బ్యాడ్మింటన్‌లో పతకం అందుకోనుంది. తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ 11–21, 21–5, 21–19తో కొడాయ్ నరొకపై గెలుపొంది అదిరే ఆరంభం అందించాడు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 21–18, 24–22తో హోకి, యుగోలపై గెలుపొందారు. రెండో సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 21–10, 21–19తో కొకిపై ఖతర్నాక్ విజయం సాధించాడు. నేడు సెమీఫైనల్లో అగ్ర జట్టు చైనాతో భారత్ తలపడనుంది.

# గట్టెక్కిన అయ్యర్‌సేన!



## • జపాన్‌పై 2 పరుగులతో గెలుపు

**శానో (జపాన్) :** పసికూన జపాన్‌పై అగ్రజట్టు భారత్ కష్టంగా గట్టెక్కింది. ఐదు ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో భారత్ తొలుత 32/4 పరుగులు చేసింది. బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌పై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16, 12 బంతుల్లో 1 ఫోర్), సంజు శాంసన్ (9, 7 బంతుల్లో 1 ఫోర్) రాణించారు. అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (3), తిలక్ వర్మ (1 నాటౌట్), శివం దూబె (0 నాటౌట్) నిరాశపరిచారు. 30 బంతుల భారత ఇన్నింగ్స్‌లో కేవలం రెండు బౌండరీలు మాత్రమే రాగా.. ఒక్క సిక్సర్ కూడా కొట్టలేదు. ఊరించే ఛేదనలో జపాన్ అద్భుతానికి చేరువైంది. 5 ఓవర్లలో 3 వికెట్లకు 30 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ (2/13) రెండు వికెట్లు పడగొట్టినా.. జపాన్ బ్యాటర్లు లక్ష్యం దిశగా సాగారు. ఓపెనర్ ఫ్లెమింగ్ (12, 12 బంతుల్లో 1 ఫోర్), బెంజమిన్ (9 నాటౌట్, 8 బంతుల్లో), ఇబ్రహీం (4, 3 బంతుల్లో ఓ ఫోర్) పరుగుల వేట సాగించారు. ఆఖరు ఓవర్లలో జపాన్‌కు 9 పరుగులు అవసరం కాగా.. భారత్ ఐదు పరుగులే ఇచ్చి ఊపిరీ పీల్చుకుంది. ఆసియా క్రీడల ముంగిట ఆతిథ్య జపాన్, భారత్ ఏకైక టీ20 మ్యాచ్‌లో గెలుపొందిన అయ్యర్‌సేన సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత్ నేరుగా క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోగా.. ప్రత్యర్థి ఇంకా ఖరారు కాలేదు.



# చాంపియన్ నజాముద్దీన్

హైదరాబాద్ : తెలంగాణ షో జంపింగ్ పోటీల్లో 11 ఏండ్ల యువ రైడర్ మిర్ నజాముద్దీన్ చాంపియన్‌గా నిలిచాడు. కండ్లుచెదిరే నైపుణ్యాలను నిలకడగా ప్రదర్శించిన నజాముద్దీన్.. 105–110సెమీ షో జంపింగ్ (అండర్–14)లో రికొట్ట హార్స్‌తో అదరగొట్టాడు. ఇదే విభాగంలో సూర్యరామ్ వర్మ, ఐజా మిర్‌లు టాప్–3లో నిలిచారు. 60సెమీ షో జంపింగ్ అండర్–14, ఓపెన్ విభాగంలో సైతం మిర్ నజాముద్దీన్ ఆజామ్ విజేతగా నిలిచాడు.

# ముగిసిన తెలంగాణ షో జంపింగ్

హైదరాబాద్ : 10 రోజులు, 120 పతక ఈవెంట్లు, 450 రైడర్లు పోటీపడిన ఈఎఫ్ఐ జాతీయ క్వాలిఫయర్, తెలంగాణ షో జంపిన్ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. వయో విభాగాలు సహా ఓపెన్ కేటగిరీల్లో షో జంపింగ్‌లో పతక ప్రదర్శన కనబరిచిన రైడర్లను నాసర్ పోలో, ఈక్వెస్ట్రియన్ అకాడమీ ప్రతినిధులు అభినందించారు. విజేతలకు ఎన్ఏఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ నవాబ్ మీర్ కుతుబుద్దీన్ ఖాన్ బహుమతులు ప్రదానం చేశారు.





# రిటైర్మెంట్ ప్రకటించిన ఫాస్ట్ బౌలర్

హైదరాబాద్ : ఇంగ్లండ్ పేసర్ మార్క్ వుడ్ (36) అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. వరుస గాయాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే, ఫ్రాంచైజీ లీగుల్లో మాత్రం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఇంగ్లండ్ తరపున అన్ని ఫార్మాట్లలో కలిపి 146 మ్యాచ్‌లలో 253 వికెట్లు తీసిన మార్క్ వుడ్, 38 టెస్టుల్లో 119 వికెట్లు సాధించారు. 2015 యాషెస్, 2019 వన్డే వరల్డ్ కప్, 2022 టీ20 వరల్డ్ కప్ గెలిచిన జట్లలో ఆయన సభ్యుడిగా ఉన్నారు



# ఓసీఏ అబ్జర్వర్‌గా రవికాంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆట ప్రతినిధి:** జపాన్‌లో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అబ్జర్వర్‌గా తెలంగాణ స్పోర్ట్స్ కమిటీ సభ్యుడు, అర్జున అవార్డు గ్రహీత వి. రవికాంత్ రెడ్డి నియమితులయ్యారు. భారత క్రీడారంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఓసీఏ ఈ కీలక బాధ్యతలు అప్పగించింది.

# క్రికెట్‌కు వుడ్ వీడ్కోలు

లండన్: ఇంగ్లండ్ పేసర్ మార్క్ వుడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇంగ్లండ్ గెలిచిన రెండు ప్రపంచకప్ (2019 వన్డే, 2022 టీ20) లలో సభ్యుడిగా ఉన్న అతడు.. 11 ఏండ్ల కెరీర్‌లో 38 టెస్టులు, 70 వన్డేలు, 38 టీ20ల్లో ఇంగ్లిష్ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 2015లో అరంగేట్రం చేసిన ఈ బౌలర్.. టెస్టుల్లో 119, వన్డేల్లో 80, టీ20ల్లో 54 వికెట్లు పడగొట్టాడు.






# అక్టోబర్ 1న ఐఎల్‌టీ20 వేలం..

ఇంటర్నేషనల్ టీ20 లీగ్ వేలానికి సమయం దగ్గరపడింది. అక్టోబర్ 1వ తేదీన దుబాయ్‌లో ఆక్షన్ జరుగనుంది. ఐసీసీ అకాడమీ ఇండోర్ ఫెసిలిటీలో నిర్వహించనున్న వేలంలో 20 దేశాలకు చెందిన ఆటగాళ్లు పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే.. ఈసారి ఎనిమిది వందలకు పైగా క్రికెటర్లు రిజిష్టరవ్వగా.. వడబోత అనంతరం రెండొందల మంది మాత్రమే వేలంలో నిలిచారని నిర్వాహకులు వెల్లడించారు. దుబాయ్ వేదికగా ఐఎల్‌టీ20 వేలం జరుగుంది. అక్టోబర్ 1వ తేదీన అక్కడి ఐసీసీ అకాడమీ ఇండోర్ ఫెసిలిటీలో ఆక్షన్ ఉండనుంది. వేలానికి మరో తొమ్మిది రోజులే ఉండడంతో.. ప్రతి ఫ్రాంచైజీ వద్ద ఎంత డబ్బుంది? ఎంత మంది క్రికెటర్లు వేలంలో ఉన్నారు? ఎన్ని స్లాట్లు ఖాళీగా ఉన్నాయి? అనేవి కీలకంగా మారాయి. ఈసారి ప్రతి ఫ్రాంచైజీ 13 లక్షల అమెరికన్ డాలర్లు(భారతీయ కరెన్సీలో రూ.12.42 కోట్లు) ఖర్చు చేయనుంది. అయితే.. రిటెన్షన్‌కు దాదాపు రూ.6 కోట్లు పోగా.. మిగతా ఆరు కోట్లలో అవసరమై ఆటగాళ్లను కొనేందుకు సిద్ధమవుతున్నాయి ఫ్రాంచైజీలు.

# బ్లడ్ బ్యాంక్‌ను నిస్వార్థంగా నడిపిస్తున్నా


## రక్తాన్ని అమ్ముకుంటున్నాడు అనే ఆరోపణలపై చిరంజీవి ఘాటు స్పందన



తన సినీ ప్రస్థానంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 'మెగా యూత్ ఫోర్స్ ఫ్యాన్స్ మీట్'లో మెగాస్టార్ చిరంజీవి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా, తనపై, చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌పై గత కొంతకాలంగా ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దుష్ప్రచారాలు, నిందలపై ఆయన అత్యంత తీవ్రస్థాయిలో స్పందించారు. దశాబ్దాలుగా ఎంతో పవిత్రంగా, నిస్వార్థంగా నడిపిస్తున్న బ్లడ్ బ్యాంక్‌లో రక్తాన్ని అమ్ముకుంటున్నారంటూ కొంతమంది చేస్తున్న దారుణమైన ఆరోపణలు పూర్తిగా మూర్ఖత్వంతో కూడుకున్నవని ఆయన కొట్టిపారేశారు.

సినిమాల్లో తాను తీసుకునే భారీ పారితోషికంతో సమానమైన మొత్తాన్ని రక్తం విక్రయించడం ద్వారా సంపాదించాలంటే.. అసలు ఎన్ని కోట్ల రక్తం ప్యాకెట్లను విక్రయించాల్సి ఉంటుందో విమర్శలు చేసేవారికి కనీస ఆలోచన ఉందా? అని చిరంజీవి ఘాటుగా ప్రశ్నించారు. ఎవరి వద్ద నుంచి ఎలాంటి డొనేషన్లు స్వీకరించకుండా, కేవలం తన సొంత కష్టార్జితంతోనే ఈ సేవా సంస్థను స్థాపించి నడుపుతున్నానని స్పష్టం చేశారు. రక్తదానం అనే పవిత్ర ప్రక్రియ ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్న వేళ, ఇటువంటి పనికిమాలిన వ్యాఖ్యలను తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వనని, ధర్మమే తనను కాపాడుతుందని వ్యాఖ్యానించారు.

# సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి..



## 'శివశంకర వర ప్రసాద్' నుంచి 'చిరంజీవి' వరకు అపూర్వ ప్రయాణంపై మెగాస్టార్ భావోద్వేగం





తన జీవితంలో అతిపెద్ద విజయమని వ్యాఖ్య తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి ఒక సామాన్యుడిగా అడుగుపెట్టి, ఎన్నో విజయాలను సొంతం చేసుకుని మెగాస్టార్ గా అవతరించిన చిరంజీవి... తన సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా అత్యంత భావోద్వేగపూరిత పోస్ట్‌ను పంచుకున్నారు. 1978 సెప్టెంబర్ 22న తాను నటించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' వెండితెరపై విడుదలైన రోజే తన జీవితంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజున కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే తన అసలు పేరును 'చిరంజీవి'గా మార్చుకున్నానని, నేడు అదే పేరు తనకు కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత గుర్తింపుగా మిగిలిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు.

సుదీర్ఘమైన ఈ 48 ఏళ్ల పయనంలో ఎన్నో రకాల పాత్రలను పోషించానని, లెక్కలేనన్ని అపూర్వ విజయాలు, గౌరవాలు, జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకున్నానని చిరంజీవి పేర్కొన్నారు. తనకు నటుడిగా అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, తనలోని సరికొత్త నటనను ఆవిష్కరించిన దర్శకులు, అహర్నిశలు శ్రమించిన సాంకేతిక నిపుణులు, తోటి నటీనటులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇవన్నీ ఒకెత్తయితే తనపై కోట్లాది మంది అభిమానులు చూపిస్తున్న నిరంతర ప్రేమాభిమానాలే తన జీవితంలో అతిపెద్ద విజయమని, అభిమానులను తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ శిరస్సు వంచి ధన్యవాదాలు అర్పిస్తున్నానని వెల్లడించారు. కాగా, చిరు నటించిన మొదటి సినిమా 'పునాది రాళ్లు' అయినప్పటికీ, 'ప్రాణం ఖరీదు' ముందుగా విడుదలైంది. ప్రస్తుతం ఆయన 'కాకా', 'విశ్వంభర' వంటి భారీ ప్రాజెక్టులతో వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు.

# మహావీర్ కర్ణగా రాఘవ లారెన్స్..

## అంచనాలు పెంచుతున్న ఫస్ట్ లుక్!




ప్రముఖ నటుడు రాఘవ లారెన్స్, దర్శకుడు రమేశ్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'మహావీర్ కర్ణ' నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో కర్ణుడి పాత్రలో రాఘవ లారెన్స్ లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పెన్ మూవీస్ తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఈ పోస్టర్‌ను విడుదల చేయడంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. పెన్ మూవీస్ అధినేత జయంతిలాల్ గడ, ఆర్‌వి స్టూడియోస్ మరియు శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. సుమారు రూ. 150 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాఘవ లారెన్స్ తన కెరీర్‌లో మొదటిసారిగా ఒక పౌరాణిక పాత్రను పోషిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సినిమాను ప్రేక్షకులకు ఒక గొప్ప విజువల్ ఫీస్ట్‌గా అందించాలనే లక్ష్యంతో మేకర్స్ పని చేస్తున్నారని సమాచారం. ఇందుకోసం భారీ సెట్లు, ఆనాటి కాలాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్లు, కళ్లు చెదిరే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అత్యాధునిక విఎఫ్ఎక్స్ హంగులతో కర్ణుడి ప్రపంచాన్ని అపూర్వమైన రీతిలో తెరపై ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గంభీరమైన రాజ్యాలు, పురాతన యుద్ధ క్షేత్రాలు, ఉత్కంఠభరితమైన పోరాట సన్నివేశాలతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించాలని దర్శకుడు రమేశ్ వర్మ భావిస్తున్నారు. గౌరవం, విధి, విశ్వాసం, త్యాగాలకు ప్రతీకగా నిలిచే కర్ణుడి పాత్రలో లారెన్స్ ఎలా ఉంటారన్నది ఆసక్తికరం. సినిమాలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ఒక్కొక్కటిగా వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

# రష్మిక అంకితభావం అద్భుతం..

### : 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లే




రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తాను దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా' గురించి, ఆమెతో తనకున్న అనుబంధం గురించి దర్శకుడు రవీంద్ర పుల్లే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, రష్మికతో కలిసి పనిచేయడం ఒక స్ఫూర్తిదాయకమైన, మర్చిపోలేని అనుభూతి అని ఆయన అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఒక సుదీర్ఘమైన, ఎమోషనల్ పోస్ట్ చేశారు. "కొన్ని పుట్టినరోజులు కేవలం శుభాకాంక్షల వల్ల ప్రత్యేకంగా నిలుస్తాయి. కానీ ఈ పుట్టినరోజు మాత్రం ఆ విషెస్ చెప్పిన వారి వల్ల మరింత ప్రత్యేకంగా మారింది. నాకు కాల్స్, మెసేజ్‌లు, పోస్టుల ద్వారా విషెస్ చెప్పిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మీరు చూపించిన ప్రేమ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది" అంటూ రవీంద్ర తన పోస్టులో పేర్కొన్నారు. అనంతరం 'మైసా' చిత్రం గురించి ప్రస్తావిస్తూ.. "మా ప్రయాణంపై నమ్మకం ఉంచి, 'మైసా' చిత్రాన్ని ఇంతగా ఆదరిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రోత్సాహం మాటల్లో చెప్పలేనిది. ఈ కల నిజం కావడానికి అండగా నిలిచిన నా టీమ్, కుటుంబం, స్నేహితులు, ముఖ్యంగా రష్మిక మందన్న గారికి నేను ఎంతో రుణపడి ఉంటాను" అని ఆయన వివరించారు. రష్మిక గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, "ఈ సినిమాను నమ్మి, ఎంతో విశ్వాసంతో నిలబడిన రష్మిక గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. 'మైసా' కోసం ఆమె ఎంతో నిజాయితీ, అంకితభావం, హృదయంతో పనిచేశారు. ఆమెతో కలిసి పనిచేయడం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఈ ప్రయాణంలో ఆమె ఒక ముఖ్యమైన భాగం కావడం సంతోషంగా ఉంది" అని రవీంద్ర పుల్లే తెలిపారు. "మీ అందరి ప్రేమ నన్ను మరింత బాధ్యతాయుతంగా ఉండేలా చేస్తుంది. మెరుగైన పని చేయడానికి నన్ను ప్రోత్సహిస్తుంది. మరిన్ని మంచి కథలతో మీ ముందుకు వస్తాను. ఈ ప్రయాణంలో అందరం కలిసి ముందుకు సాగుదాం" అని చెబుతూ ఆయన తన పోస్టును ముగించారు. ప్రస్తుతం రవీంద్ర పుల్లే వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.


# స్టైలిష్ అవతార్‌లో రాశి ఖన్నా..

## మోనోక్రోమ్ ట్రెండ్ సెట్!

టాలీవుడ్ లోనే కాక బాలీవుడ్ చిత్ర పరిశ్రమలలో పవర్-డ్రెస్సింగ్ గోల్స్‌ను సెట్ చేస్తూ అలరిస్తున్న బ్యూటీ రాశి ఖన్నా, తాజాగా తన స్టైలిష్ ఫోటోలతో సోషల్ మీడియాను ఊపేస్తోంది. షార్ప్‌గా ఉన్న క్లాసీ వైట్ బ్లేజర్ మిని డ్రెస్‌లో ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ అండ్ రాయల్ పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. మోడర్న్ టచ్‌తో ఉన్న ఈ మోనోక్రోమ్ అవతార్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్ మనసులను కొల్లగొడుతున్నాయి..ఆ విశేషాలు చూద్దాం.. తాజా స్పెషల్ ఫోటోషూట్ కోసం రాశి ఖన్నా ప్రసిద్ధ స్టైలిస్ట్ షీఫా జే గిలానీ డిజైన్ చేసిన వైట్ బ్లేజర్ మిని డ్రెస్‌ను ఎంచుకుంది. ఇక ప్లంగింగ్ నెక్‌లైన్, స్ట్రక్చర్డ్ షోల్డర్స్‌తో ఉన్న ఈ వైట్ అవుట్‌ఫిట్‌లో రాశి ఎంతో ఎలిగంట్‌గా కనిపిస్తోంది. దీనికి తగ్గట్టుగా సాఫ్ట్ రెట్రో వేవ్ బ్యాంగ్స్, వార్మ్ బ్లష్ టోన్స్, నూడ్ లిప్‌స్టిక్ జత చేసి ఆమె ఇచ్చిన రాయల్ లుక్ ఈ ఫోటోషూట్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది సోషల్ మీడియాలో ఈ గ్లామరస్ పిక్స్ షేర్ చేస్తూ రాశి ఖన్నా "మీరు సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తూ ఉన్న సమయంలో.." అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు "స్టన్నింగ్", "బ్యూటిఫుల్ ఐకాన్", "ఫ్యాషన్ క్వీన్" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. వరుస విజయాలతో సక్సెస్ ట్రాక్: ఇక 'యోధ', 'అరన్మనై 4', 'ది సబర్మతి రిపోర్ట్' వంటి సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించి మంచి విజయాలు అందుకుంది రాశి. నటిగా తనలోని వైవిధ్యాన్ని చూపుతూనే, మరోవైపు హెవీ ఫ్యాషన్ ఎడిటోరియల్ షూట్స్‌తో సౌత్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ టాప్ స్టైల్ ఐకాన్‌గా గుర్తింపు తెచ్చుకుంది.



# రణబాలి నుంచి మెలోడీ సర్ప్రైజ్..



టాలీవుడ్ మోస్ట్ హిట్ పేయిర్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీగా నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి "ఏందయ్యా స్వామి" అనే బ్యూటిఫుల్ లిరికల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. 1850ల కాలం నాటి పల్లెటూరి వాతావరణం, నూతన దంపతుల ముద్దుల అనుబంధాన్ని చాటే ఈ పాట వినగానే శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తోంది. ాశ్రీంశీ =ఘు౦ - నాని సినిమాల్లో ఇప్పటివరకు ఇలాంటి విలనే లేడా? రాయల్ మ్యాజిక్‌లా విజయ్-రష్మిక కెమిస్ట్రీ: 'రణబాలి' సినిమాలో విజయ్ దేవరకొండ రణబాలిగా, రష్మిక మందన్న జయమ్మగా నటిస్తున్నారు. ఈ "ఏందయ్యా స్వామి" పాట వీరిద్దరి పెళ్లి వేడుక నేపథ్యంతో పాటు నూతన దంపతుల మధ్య ఉండే అమాయకమైన ప్రేమను, సాన్నిహిత్యాన్ని ఎంతో అందంగా చూపుతోంది. ఇక 19వ శతాబ్దపు తెలుగు సాంప్రదాయ పెళ్లి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన తీరు, వారిద్దరి మధ్య ఉన్న హిట్ కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అజయ్-అతుల్ దివ్యమైన సంగీతం: ఈ పాటకు ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అందించిన స్వరాలు ప్రధాన బలం. పల్లెటూరి జానపద శైలి, ఆధునిక మెలోడీ ట్యూన్స్ కలబోతగా రూపొందిన ఈ పాట వినగానే రిపీట్ మోడ్‌లో పెట్టుకునేలా ఉంది. శ్వేతా మోహన్, అజయ్ గోగావాలే తమ తియ్యని గొంతుతో ఈ మెలోడీకి ప్రాణం పోయగా, సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి అందించిన సాహిత్యం నూతన దంపతుల అనురాగాన్ని ఎంతో చక్కగా ఆవిష్కరించింది. ఈ పాట పూర్తి స్థాయిలో విడుదలకాక ముందే, దీనికి సంబంధించిన చిన్న వెడ్డింగ్ ప్రోమో సోషల్ మీడియాను ఊపేసింది. ఇప్పుడు ఫుల్ లిరికల్ సాంగ్ రావడంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. విజువల్ గ్రాండియర్, ఎమోషనల్ స్టోరీ టెల్లింగ్, అద్భుతమైన మ్యూజిక్ కలగలిసి ఈ పాటను ఒక టైమ్‌లెస్ లవ్ యాంథమ్‌గా మార్చేశాయి. అక్టోబర్ 16న థియేటర్లలోకి రణబాలి: ఇప్పటికే "ఏందయ్యా స్వామి" పాటతో శ్రోతల మనసు దోచుకున్న 'రణబాలి' చిత్రంపై అంచనాలు తారస్థాయికి చేరాయి. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఇక విజయ్-రష్మిక మ్యాజిక్ మళ్లీ రిపీట్ కావడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.